ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

బుధవారం 11 జూన్ 2025

ఏడాదిలో రూ.9.2 లక్షల కోట్ల పెట్టుబడులు
- ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉపాధి కల్పించడమే ధ్యేయం
- పరిశ్రమలకు నీటి చార్జీలు తగ్గించే ప్రయత్నం
- అమరావతి నిర్మాణం 2028 నాటికి పూర్తిచేయాలనేది సీఎం లక్ష్యం

... వార్త మెయిన్ ఎడిషన్‌లో

- ఫ్యాప్సీ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి టీజీ భరత్

మోక్షం లేని నాడు-నేడు

ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా పనులు

- కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించని గత వైసీపీ ప్రభుత్వం
- సాధారణ ఎన్నికల ముందే ఆగిన పనులు
- ప్రభుత్వం మారినా కలగని మోక్షం
- నిధుల కోసం సమగ్ర శిక్ష అధికారుల ప్రతిపాదనలు



అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ రామాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అప్పట్లో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

పాఠశాలలు బుధవారం పునఃప్రారంభం కానున్నాయి. స్కూళ్లు తెరిచేనాటికి అన్ని యాజమాన్యాల పరిధిలోని విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యా శాఖ, సమగ్ర శిక్ష అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమం కింద ఎంపిక చేయని పాఠశాలల్లో భవనాలకు మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన పనులకు అధికారులు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే నాడు-నేడు కార్యక్రమం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న వివిధ రకాల పనులు ఇప్పటికీ అలాగే దర్శనమిస్తున్నాయి. జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరంలో 604 పాఠశాలల్లో నాడు-నేడు కింద రూ.250 కోట్ల అంచనా వ్యయంతో 988 పనులు చేపట్టారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అదనపు గదులు, ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పన పను లు చేపట్టారు. వీటిలో సుమారు 60 శాతం పనులకు రూ.132 కోట్లు ఖర్చు చేశారు. అయి తే చేసిన పనులకు కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించలేదు. ఫలితంగా గత ఏడాది సార్వత్రిక ఎన్నికల ముందు నాడు-నేడు కింద వివిధ దశల్లో ఉన్న పనులు నిలిచిపోయాయి.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో ఆగిన నాడు-నేడు పనులకు నిధులు మంజూరు చేసి 2025-26 విద్యా సంవత్సరంనాటికి పూర్తి చేస్తారని అంతా భావించారు. ఈ మేరకు విద్యా శాఖాధికారులు జిల్లాలో నాడు- నేడు కార్యక్రమం కింద చేపట్టి, మధ్యలో వదిలేసిన పనుల వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. కానీ నిధులు మాత్రం విడుదల కాలేదు. దీంతో సుమారు ఏడాది నుంచి ఎక్కడ పనులు అక్కడే అన్న చందంగా వున్నాయి. కూటమి ప్రభుత్వం గతంలో నాడు-నేడు కార్యక్రమం కింద ఎంపిక చేసిన పాఠశాలలను పక్కనపెట్టి, మిగిలిన పాఠశాలల్లో అదనపు తరగతుల గదులు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నది. దీంతో ఆయా పాఠశాలల్లో పనులు దాదాపుగా చివరి దశకు చేరాయి. నాడు-నేడు కింద చేపట్టి, అసంపూర్తిగావున్న ... మిగతా 8వ పేజీలో



కె.కోటపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణం

రెవెన్యూలో బదిలీలు

12 మంది తహశీల్దార్లు, 28 మంది డీటీలు, 26 మంది సీనియర్ అసిస్టెంట్లు, 14 మంది జూనియర్ అసిస్టెంట్లు

- ట్రెజరీలో బదిలీలపై విమర్శల వెల్లువ

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రెవెన్యూకు సంబంధించి 85 మందిని బదిలీ చేశారు. వీరిలో 12 మంది తహశీల్దార్లను సోమవారం రాత్రి బదిలీ చేయగా, 28 మంది డిప్యూటీ తహశీల్దార్లు, 26 మంది సీనియర్ అసిస్టెంట్లు, 14 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు అటెండర్లకు స్థానచలనం కల్పిస్తూ అర్ధరాత్రి తరువాత ఉత్తర్వులు వెలువరించారు. పలువురిని విశాఖ జిల్లా నుంచి అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు పంపగా, అల్లూరి, అనకాపల్లి నుంచి కొందరిని విశాఖకు బదిలీ చేశారు. అయితే విశాఖ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో కొద్దిమందిని తప్ప మిగిలిన వారిని కదిలించలేదనే వాదన రెవెన్యూ ఉద్యోగుల్లో వినిపిస్తోంది. పలు కారణాలతో కొందరు బదిలీల నుంచి తప్పించుకున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక పెందుర్తి తహశీల్దారుగా నియమితులైన అల్లూరి జిల్లా జీకే వీధి తహశాల్దార్ టి.రామకృష్ణపై పలు ఆరోపణలు ఉన్నాయని, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రాజాం, వంగర, కొత్తూరు మండలాల్లో పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడడంతో ఆయన సస్పెండ్ అయ్యారని అంటున్నారు. అటువంటి అధికారిని పెందుర్తి తహశీల్దారుగా ఎలా నియమిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ట్రెజరీ బదిలీల్లో ఒంటెత్తు పోకడలు

జిల్లా ఖజానా కార్యాలయంలో ఐదారు రోజుల క్రితం జరిగిన బదిలీల్లో అక్రమాలు జరిగాయని 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు. బదిలీల కోసం ఏర్పాటైన కమిటీ సోమవారం రాత్రి చర్చించి ఉత్తర్వులను స్వల్పంగా సవరించింది. మొత్తం 34 మందిలో ఐదుగురి వ్యవహారంలో పొరపాట్లు సవరించామని ఇన్‌చార్జి డీటీవో గోవిందరావు తెలిపారు. అయితే కార్యాలయంలో భారీగా మామూళ్లు వసూలుచేసే ఉద్యోగిని వెనుకేసుకు వచ్చే ప్రయత్నం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా ... మిగతా 8వ పేజీలో



బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరై మంగళవారం రాత్రి జడ్పీ సమావేశం మందిరంలో నిరీక్షిస్తున్న టీచర్లు

టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ నేటికి వాయిదా

- సాంకేతిక సమస్యతో సర్వర్ పనిచేయకపోవడమే కారణం

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సెకండరీగ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) బదిలీల కౌన్సెలింగ్‌కు సాంకేతిక సమస్య ఎదురైంది. రాష్ట్రస్థాయిలో పాఠశాల విద్యా శాఖ సర్వర్‌లో ఏర్పడిన ఇబ్బంది వల్ల కౌన్సెలింగ్ వాయిదా పడింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం మంగళవారం కౌన్సెలింగ్ ప్రారంభం కావాలి. ఐదారు రోజులు చేపట్టాల్సిన ఈ ప్రక్రియకు సంబంధించి జడ్పీ సమావేశ మందిరాన్ని వేదికగా ఖరారు చేశారు. తొలిరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని విద్యా శాఖ ప్రకటించింది. సీనియారిటీ జాబితా ప్రకారం ఒకటి నుంచి 500 నంబర్ వరకూ తొలిరోజు బదిలీలు చేపడతామని వెల్లడించడంతో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి టీచర్లు హాజరయ్యారు. బదిలీలు మాన్యువల్‌గా చేపట్టాల్సి ఉన్నా సీనియారిటీ జాబితా ప్రదర్శన, ఆప్షన్స్ కోరుకున్న తరువాత వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌కు సాంకేతిక సమస్య వచ్చింది. దీంతో మధ్యాహ్నం నుంచి కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తూ వచ్చారు. సమస్య తొలగకపోవడంతో రాత్రి తొమ్మిది గంటల సమయంలో బదిలీ కౌన్సెలింగ్ బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు విద్యా శాఖ ప్రకటించింది. అయితే బుధవారం ఒకటో నంబరు నుంచి 300 వరకూ మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపింది. గురువారం నుంచి ఏ ర్యాంకు నుంచి ఏ ర్యాంకు వరకూ కౌన్సెలింగ్ నిర్వహించేదీ ప్రకటిస్తామని పేర్కొంది. కౌన్సెలింగ్‌కు మంగళవారం ఉదయం ఏజెన్సీ, మైదానం నుంచి వచ్చిన టీచర్లు గంటల తరబడి పడిగాపులు కాశారు. తీరా బుధవారానికి కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించడంతో తిరిగి సొంతూళ్లకు వెళ్లడానికి రవాణా సదుపాయం లేకపోవడంతో నగరంలోనే బస చేయాల్సి వస్తోందని పలువురు టీచర్లు వాపోతున్నారు.

కదం తొక్కిన తెలుగు మహిళ



అనకాపల్లి ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న తెలుగు మహిళలు

'సాక్షి' చానెల్‌లో నిర్వహించిన డిబేట్‌లో అమరావతి మహిళలపట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజు, ఇతని వ్యాఖ్యలను సమర్థించిన కొమ్మినేని శ్రీనివాసరావుతోపాటు చానెల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం అనకాపల్లి, చోడవరం, పాయకరావుపేటల్లో ప్లకార్డులు పట్టుకుని నిరసన ర్యాలీలు నిర్వహించారు. అమరావతి మహిళలకు జగన్మోహన్‌రెడ్డి, భారతీరెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేశారు.



సోమవరం గ్రామంలోని ఎన్టీఆర్ కల్యాణ మండపంలో రైతులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

గ్రామ స్వరాజ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ
- సోమవరం గ్రామంలో 'పల్లె పిలుస్తోంది రా.. కదలి రా!'
- అధికారులతో కలిసి గ్రామస్థులతో సమావేశం
- ప్రజల సమస్యలు తెలుసుకొని.. పరిష్కరిస్తానని భరోసా
- పంచాయతీ కార్యాలయంలో రాత్రి బస

-వార్త 8వ పేజీలో

లోకేశ్ ప్రజాదర్బార్

వినతుల స్వీకరణ

- కొన్నింటి పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు
- ఇంటర్ జోనల్ బదిలీలు చేయాల్సిందిగా డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకుల వినతి
- పదోన్నతులు కల్పించాల్సిందిగా తెలుగు పండిట్ల విజ్ఞప్తి
- లంకెలపాలెంలో కోనేరు అభివృద్ధిలో నిధులు గోల్‌మాల్‌పై విచారణ చేయండి



పదోన్నతులు కల్పించాలని మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న తెలుగు పండిట్‌లు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం ఉదయం నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వినతులు స్వీకరించిన ఆయన...పలు సమస్యలపై అక్కడికక్కడే సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. తమకు నెలవారీ జీతం చెల్లించడంతోపాటు ఇంటర్ జోనల్ బదిలీలకు అవకాశం కల్పించాలని ఏపీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల ... మిగతా 8వ పేజీలో

సెజ్‌లో యాక్షన్ టెసా

105 ఎకరాల్లో రూ.200 కోట్లతో కంపెనీ ఏర్పాటు

Action TESA PANELS | FLOORING | DOOR SKINS

- 3-4 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- భూమి పూజ చేసిన కలెక్టర్, ఎలమంచిలి ఎమ్మెల్యే



యాక్షన్ టెసా కంపెనీ యాజమాన్య ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే విజయ్‌కుమార్

రాంబిల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం- రాంబిల్లి మండలాల పరిధిలోని ప్రత్యేక ఆర్థిక మండలి (సెకండ్ ఫేజ్)లో మంగళవారం 'యాక్షన్ తెసా' పరిశ్రమ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఇళ్లల్లో ఇంటీరియర్‌కు వినియోగించే ఫ్లోర్ లేమినేషన్/ కప్‌బోర్డుల ప్యానల్ బోర్డులు తయారు చేసే ఈ కంపెనీ సుమారు రూ.200 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న పరిశ్రమకు కంపెనీ యజమానులతోపాటు కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాంబిల్లి మండలం కృష్ణంపాలెంలో గతంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో సుమారు 105 ఎకరాలను యాక్షన్ టెసా కంపెనీకి కేటాయించినట్టు చెప్పారు. కంపెనీ నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా మూడు వేల నుంచి నాలుగు వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. సకాలంలో నిర్మాణం పూర్తిచేసి సెజ్ నిర్వాసితులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ టెసా కంపెనీ చైర్మన్ ఎన్‌కే అగర్వాల్, ఎండీ వివేక్‌జైన్, అనకాపల్లి ఆర్డీఓ ఆయిషా బేగమ్, రాంబిల్లి తహశీల్దార్ శ్రీనివాసరావు, కృష్ణంపాలెం సర్పంచ్ పైలా సత్తిబాబు, యాక్షన్ టెసా కంపెనీ ప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ముసురు

పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం

- ఉరుములు, పిడుగులతో ఈదురుగాలులు
- రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షం కురుస్తుందని ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ వెల్లడి



మునగపాక మెయిన్‌రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

అనకాపల్లి/ అగ్రికల్చర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్):

రుతుపవనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మంగళవారం ముసురు వాతావరణం నెలకొంది. అనకాపల్లి, పరవాడ, మాకవరపాలెం, సబ్బవరం, ఎస్.రాయవరం, కశింకోట, ఎలమంచిలి, మాడుగుల, మునగపాక, అచ్యుతాపురం, రావికమతం, తదితర మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో ఆకాశం మేఘావృతమై, అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిశాయి. కొన్నిచోట్ల ఉరుములు, పిడుగులతోపాటు ఈదురుగాలులు వీచాయి. ఈ వర్షం కూరగాయల పంటలకు మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.

కాగా సోమవారం వడగాడ్పులతో వేడి వాతావరణం నెలకొనగా, మంగళవారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై జల్లులు పడడంతో వాతావరణం చల్లగానే వుంది. దీంతో ప్రజలు ఊరట చెందారు. కాగా రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉండి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34 నుంచి 35.2 డిగ్రీల మధ్య నమోదు అవుతాయని స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను అనుకూలంగా మార్చుకుని కూరగాయల పంటలను... ముఖ్యంగా తీగజాతి పంటలను విత్తుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అరటిలో సిగతోక తెగులు ఆశించి, వర్షాలు అధికమైతే తెగులు వ్యాపించే అవకాశం ఉందని, దీని నివారణకు ప్రాపికోనజోల్ మందును పిచికారీ చేయాలని చెప్పారు. భూమిలో అధిక తేమ వల్ల ... మిగతా 8వ పేజీలో

నేడు 2 సచివాలయాలు ప్రారంభం

ఎలమంచిలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని 8వ వార్డు పరిధిలో పీవీ కాంప్లెక్సు వద్ద 4, 5 వార్డుల నూతన సచివాలయాలను బుధవారం ఎమ్మెల్యే విజయకుమార్ ప్రారంభించనున్నారని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ రమాకుమారి హాజరవుతున్నారన్నారు.

పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం సబ్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరం, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులంతా సంఘటితంగా చీడపీడలను నియంత్రించాలి


ప్రసంగిస్తున్న శాస్త్రవేత్త ప్రభాకరరావు

ఎస్.రాయవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి పంటలో తెల్లదోమ, కొమ్ము పురుగు వంటి చీడపీడలు, కోతుల బెడద నియంత్రించడానికి రైతులంతా సంఘటితంగా చర్యలు చేపట్టాలని రాజమండ్రి వాణిజ్య పంటల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె ప్రభాకర రావు, ఉద్యావన శాస్త్రవేత్త డాక్టర్ ఎం శివ అన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగరాజుపాలెం, వేమగిరి గ్రామాల్లో పలువురు శాస్త్రవేత్తలు, అధికారులు పర్యటించారు. బీసీటీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరి పంట కంటే ముందు వ్యవసాయ భూముల్లో పచ్చిరొట్ట ఎరువులను వేసి నేలలో కలియ దున్నడం ద్వారా నేలను సారవంతంగా మార్చవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో సౌజన్య, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త నాగేంద్ర ప్రసాద్, సర్పంచ్ అబ్బాయి దొర, మాజీ సర్పంచ్ పోతు రంగారావు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ఎస్.రాయవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరులో మంగళవారం రాజమండ్రి త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి స్థానిక ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సోమనాయుడు, నాగేశ్వర రావు, శ్రీనివాస్, రమాదేవి పాల్గొన్నారు.

నేడు టీడీపీ కార్యాలయం ప్రారంభం

పాయకరావుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజుగారిబీడులోని టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాల బాబుకి చెందిన భవనంలో నూతన పార్టీ కార్యాలయాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు విజ్ఞప్తి చేశారు.

జ్వరాల నివారణకు ముందస్తు చర్యలు

నక్కపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక శివారు తిరుపతిపాలెంలో జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మంగళవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలంతా కలిసి గ్రామంలో వున్న మురికికాలువల వద్ద దోమల నివారణకు స్ప్రేయింగ్ చేశారు. గ్రామంలో ఇంటింటా జ్వరపీడితులు ఎవరైనా వున్నారా అని ఆరా తీశారు.

నేడు మునగపాకలో ఉచిత కంటి వైద్య శిబిరం

మునగపాక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మునగపాక పంచాయతీ వద్ద ఈనెల 11వ తేదీన జరగనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం పిలుపునిచ్చారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిమన్నారు.

ఉన్నత చదువుల్లో రాణించాలి

మునగపాక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత తరగతుల్లో కూడా ఇదే స్ఫూర్తితో చదువుకోవాలని ప్రియదర్శిని పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వేగి వీరునాయుడు పేర్కొన్నారు. షైనింగ్‌స్టార్ అవార్డులందుకున్న తోట మమత, జి.నిర్మల్‌కుమార్‌లను మంగళవారం స్కూల్ ఆవరణలో ఘనంగా సత్కరించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

- నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు రమాకుమారి
- పాయకరావుపేటలో భారీ ర్యాలీ నిర్వహించిన మహిళలు
- గౌతమ్ సెంటర్‌లో సాక్షి పేపర్‌ని తగులబెట్టిన మహిళలు

పాయకరావుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):రాజధాని అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసినవారితోపాటు వాటిని ప్రసారం చేసిన సాక్షి మీడియాపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు ఎం.రమాకుమారి డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు, టీడీపీ శ్రేణులు పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మంగవరం జంక్షన్


సాక్షి దిన పత్రికను తగులబెడుతున్న దృశ్యం



పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

నుంచి గౌతమ్ థియేటర్ వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించిన మహిళలు గౌతమ్ సెంటర్‌లో సాక్షి దినపత్రికను తగులబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎం.రమాకుమారి మాట్లాడుతూ రాజధాని మహిళల శీల హననం గురించి మాట్లాడడం అత్యంత దారుణమన్నారు. వ్యాఖ్యలు చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ వ్యాఖ్యలను ప్రచారం చేసిన పత్రిక, చానెల్‌ని తక్షణం నిషేధించాలని, జగన్‌రెడ్డి దంపతులు అమరావతి మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ఉద్యమాల ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపురం మాజీ సర్పంచ్ సీహెచ్.సన్యాసమ్మ, జనసేన నాయకులు నారపురెడ్డి పద్మ, దేవాది మంగాదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, నాయకులు బొంది కాశీవిశ్వనాథం, కంకిపాటి వెంకటేశ్వరావు, చింతకాయల రాంబాబు, కలిగట్ల శ్రీనివాస్, పల్లా విలియంకేరి, వేములపూడి అప్పారావు, ఎం.దుర్గాప్రసాద్ తదితరులతోపాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

పాయకరావుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు, టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో నియోజకవర్గ నందమూరి కల్చరల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, కల్చరల్ యూత్ గౌరవాధ్యక్షుడు చింతకాయల రాంబాబు తదితరులు కేక్‌ను కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ యూత్ అధ్యక్షుడు విశ్వనాథుల శ్రీను, శ్రీరంగం వరహాలు, అనిశెట్టి శ్రీను, భద్రరావు, రావాడ గోవిందరెడ్డి, వేములపూడి


పాయకరావుపేట పీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అప్పారావు, పలువురు అభిమానులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి టీడీపీ కార్యాలయంలో మంగళవారం సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలను నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. మాజీఎమ్మెల్సీ పప్పల చలపతిరావు కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా బాలకృష్ణ నటనా చాతుర్యాన్ని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, జిల్లా కార్యదర్శి రాజాన సూర్యనాగేశ్వరరావు, టీడీపీ నేతలు బొద్దపు రమణ, కరణం రవి, నమ్మి రమణ, గొర్లె బాబూరావు, గుర్రాల రాము, ఎస్.రమణబాబు, జె.అప్పారావు పాల్గొన్నారు.


ఎలమంచిలిలో బాలకృష్ణ పుట్టినరోజు కేక్‌ను కట్‌చేసిన మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

పంచదార్ల వద్దే ఇంటి స్థలాలు ఇవ్వాలి

- కలెక్టర్, ఎమ్మెల్యేలకు కృష్ణంపాలెం సెజ్ నిర్వాసితుల వినతిపత్రాలు

రాంబిల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తమకు పంచదార్ల వద్దే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కృష్ణంపాలెం పంచాయతీకి చెందిన ఎస్ఈజడ్ నిర్వాసితులు డిమాండ్ చేశారు. మంగళవారం కృష్ణంపాలెంలోని యాక్సిన్ తెసా కంపెనీ భూమి పూజ కార్యక్రమానికి వచ్చిన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్‌లకు తమ గోడును వినిపించుకున్నారు. తమ భూములు తీసుకున్నప్పుడు పంచదార్ల వద్ద ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు అచ్యుతాపురం మండలం రావిపాలెంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని అధికారులు చెబుతున్నారన్నారు. తమకు పంచదార్లలోనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.8.36లక్షలు ప్యాకేజీ కనీసం పునాదులకు సరిపోదని, రూ.25లక్షలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను కలెక్టర్, ఎమ్మెల్యేలకు నిర్వాసితులు అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ అర్హులైన నిర్వాసితులందరికీ ఆర్ఆర్ ప్యాకేజీ అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలపై వారితో మరోసారి మాట్లాడి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆయేషాబేగమ్, తహసీల్దార్ శ్రీనివాసరావు, నిర్వాసితులు పాల్గొన్నారు.


కలెక్టర్, ఎమ్మెల్యేలకు సమస్యలు తెలియజేస్తున్న కృష్ణంపాలెం ఎస్ఈజడ్ నిర్వాసితులు

బాల్య వివాహాలు అరికట్టాలి : ఎంపీపీ జయమ్మ

మునగపాక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో దుష్ప్రభావాలు చోటుచేసుకుంటాయని ఎంపీపీ మళ్ల జయమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక డ్వాక్రా భవనంలో కిశోర వికాసంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలల సంరక్షణకు చట్టాలు ఉన్నాయని, వాటి గురించి తెలుసుకోవాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్.విమలగిరి మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాలు బాలికల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరాదేవి, సూపర్‌వైజర్ అన్నపూర్ణ, సీహెచ్‌వో దేవకాంత, కూటమి నాయకులు టెక్కలి పరశురాం, దాడి శివ, అప్పలనాయుడు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అపరంజిని అన్నారు. మంగళవారం స్థానిక అంగ


మునగపాకలో జరిగిన కిశోర వికాసం అవగాహన ర్యాలీ

న్‌వాడీ కేంద్రంలో బాల్యవివాహాలపై తల్లులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించడంతోపాటు చదివించాలన్నారు. 21 ఏళ్లు వచ్చే వరకు వివాహాలు చేయకూడదన్నారు. బాల్య వివాహానికి అనుమతించినా, ప్రోత్సహించినా, సహకరించినా వారందరినీ నిందితులుగా పరిగణించపడతారన్నారు. అనంతరం వారు ర్యాలీని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పద్మ పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మే 2వ తేదీ నుంచి జూన్ 10 వరకూ పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కిశోర్ బాలికల వేసవి శిక్షణ తరగతులు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. చివరి రోజున సీడీపీవో శ్రీవిద్య, సూపర్‌వైజర్లు లలిత, పద్మ, సీడ్ సంస్థ ప్రతినిధి అమ్మాజీ, మహిళా పోలీస్ పద్మ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర్ బాలికలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

బాల్య వివాహాల వల్ల ఆడపిల్లలకు కలిగే నష్టాలు, సైబర్ నేరాలు, బాలల హక్కులు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్
- ఏటికొప్పాకలో రూ.20 లక్షలతో నిర్మించిన వాణిజ్య సముదాయం ప్రారంభం

ఎలమంచిలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో రూ. 20 లక్షలతో నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని ఎమ్మెల్యే విజయకుమార్, సర్పంచ్ బజంత్రీల లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పంచాయతీల్లో ప్రజలకు అన్ని సదుపాయాలు, వసతులు కల్పించేందుకు ఆదాయ వనరులను పెంపొందించుకోవాలన్నారు. ఏటికొప్పాక అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాండ్రకోట చిరంజీవి, నాయకుడు అన్నం బాబ్జీ, పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


వాణిజ్య సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

వాహనాల వేగాన్ని నియంత్రించాలి

సెజ్ పునరావాస కాలనీ వాసుల ఆందోళన

అచ్యుతాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాలనీ ప్రధాన రోడ్డు ద్వారా రాకపోకలు సాగించే వాహనాలు వేగాన్ని నియంత్రించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేయాలని సెజ్ పునరావాస కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం వారు వాహనాలను ఆపి ఆందోళన చేశారు. అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణంలో ఉండడంతో వాహన రాకపోకలను అచ్యుతాపురం, వెదురువాడ, వెంకటాపురం జంక్షన్, సెజ్ పునరావాస కాలనీ మీదుగా మళ్లించారు. దీంతో వందల వాహనాలు సెజ్ పునరావాస కాలనీ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. తేలిక పాటి వాహనాలు అచ్యుతాపురం జంక్షన్, మార్టూరు రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. కాని సెజ్ కర్మాగారాలకు ఉద్యోగులు, కార్మికులను తీసుకువెళ్లే బస్సులతోపాటు యంత్రాలను కర్మాగారాలకు తీసుకువెళ్లే భారీ వాహనాలు కూడా సెజ్ పునరావాస కాలనీ మీదుగా వెళ్తున్నాయి. అయితే ఈ వాహనాలు అతి వేగంగా వెళుతుండడంతో కాలనీ వాసులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మంగళవారం ఒక కర్మాగారానికి ఉద్యోగుల్ని తీసుకువెళ్తున్న బస్సు కాలనీ ప్రధాన రోడ్డులో బైక్‌ని ఢీకొంది. బైక్‌పై వెళ్తున్న వారు గాయాలతో బయటపడినా బైక్ పూర్తిగా దెబ్బతింది. దీంతో కాలనీ వాసులు వాహనాలను ఆపి ఆందోళన చేశారు. వాహనాల వేగాన్ని నియంత్రించడానికి కాలనీ పరిధిలో కనీసం స్పీడు బ్రేకర్లయినా వేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

డిపోల ద్వారా రేషన్ పంపిణీపై ప్రజలు హర్షం

రాష్ట్ర పౌర సరఫరాల డైరెక్టర్ బోడపాటి శివదత్

పాయకరావుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం డిపోల వద్ద తిరిగి రేషన్ పంపిణీ ప్రారంభించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాల డైరెక్టర్ బోడపాటి శివదత్ అన్నారు. మంగళవారం పాయకరావుపేట, అరట్లకోటల్లో పలు రేషన్ డిపోలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీని పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డిపోల ద్వారా రేషన్ పంపిణీ విధానాన్ని తిరిగి ప్రారంభించినందుకు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇది మంచి ప్రభుత్వమని కితాబు ఇస్తున్నారని ఆయన తెలిపారు.


బృందావనంలోని డిపోలో రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న బోడపాటి శివదత్

ఉపాధి శ్రామికుల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఉపాధి శ్రామికులు

రాంబిల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచదార్ల గ్రామంలో ఉపాధి శ్రామికులు మంగళవారం కూలి డబ్బుల కోసం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ చందక రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి శ్రామికులు కష్టపడి పని చేసినా నెలలు తరబడి ప్రభుత్వం కూలి చెల్లించకపోవడం బాధాకరమన్నారు. అధిక సంఖ్యలో ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ

రాంబిల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొలువైన పైడితల్లి అమ్మవారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించారు. నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి, తీర్థ, ప్రసాదాలను భక్తులకు అందజేశారు. అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ప్రత్యేక భజనలు, కోలాటాలు నిర్వహించారు.

వైభవంగా ఆంజనేయస్వామి జాతర

నక్కపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినతీనార్లలో మంగళవారం ఆంజనేయస్వామి జాతర ఘనంగా జరిగింది. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.ఆధ్యాత్మిక శోభతో గ్రామం కళకళలాడింది.


స్వామివారిని దర్శించుకున్న భక్తులు

గురుకులాల్లో స్ప్రేయింగ్


నక్కపల్లి గురుకులంలో స్ప్రేయింగ్ చేస్తున్న వైద్య,ఆరోగ్యశాఖ సిబ్బంది

నక్కపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జూన్ 12 నుంచి పాఠశాలలు, గురుకులాలు పునఃప్రారంభం కానుండడంతో విద్యార్థులకు ఎటువంటి అనారోగ్యం కలగకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతోంది. మంగళవారం నక్కపల్లి బాలికల గురుకులం, కేజీబీవీలోనూ, ఎస్సీ, బీసీ వసతి గృహాల వద్ద వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేశారు. గొడిచెర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి సంధ్య, ఎస్. కిరణ్ ప్రసాద్, ఎంపీహెచ్ఈవో యుపీఎస్ రావు, వైద్య సిబ్బంది ఎ.లక్ష్మణమూర్తి, శ్రీనివాస్, బాలా కుమారి, కె.ఝాన్సీ పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం

మునగపాక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఎండ తీవ్రత, ఉక్కపోతలకు ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు మంగళవారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. ఉదయం భారీగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం ఉక్కపోతతో వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడ్డారు. మంగళవారం 23.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. మెయిన్‌రోడ్డుపైన, లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షం నీరు చెరువులను తలపించాయి.

ఎస్.రాయవరంలో..

గత కొద్ది రోజులుగా ఎండల వేడిని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు మంగళవారం ఉదయం కురిసిన వర్షం ఉపశమనం పొందారు. వర్షానికి పలు గ్రామాల్లో గల ప్రధాన రహదారులపై నీరు పారింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊరట చెందారు.

పలు గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు

మునగపాక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు గ్రామ పంచాయతీలు పరిధిలో మంగళవారం ఆధార్ ప్రత్యేక క్యాంపులు జరిగాయని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. మండలంలో టి.సిరసపల్లి, మునగపాక, చూచుకొండ సచివాలయాల్లో జరిగిన క్యాంపుల్లో పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియ జరిగిందన్నారు. అలాగే 11న టి.సిరసపల్లి, గణపర్తి, తిమ్మరాజుపేట, 12న పాటిపల్లి, మెలిపాక, నాగులాపల్లి, 13న రాజుపేట, చెర్లోపాలెం, ఒంపోలు గ్రామాల్లో కూడా ఆధార్ శిబిరాలు జరగనున్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాహనాల వేగానికి స్పీడ్ బ్రేకర్లతో కళ్లెం


ఉపమాక జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఐ కుమారస్వామి

నక్కపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి సర్కిల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ దిశగా పోలీస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎల్లప్పుడూ రద్దీగా వుండే హైవే జంక్షన్లు క్రాస్ చేసే చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఉపమాక హైవే జంక్షన్ వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లను సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు పర్యవేక్షణలో చేపట్టారు. నక్కపల్లి ఆస్పత్రికి వెళ్లే జంక్షన్ సహా, ఆర్టీసీ కాంప్లెక్స్, గురుకులం, హైస్కూల్ జంక్షన్ తదితర కీలక ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేస్తామని సీఐ కుమారస్వామి చెప్పారు.

దొండవాకలో తీరనున్న నీటి ఎద్దడి

నక్కపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండవాక గ్రామంలో నీటి ఎద్దడి నివారించాలని హోం మంత్రి అనిత ఆదేశించడంతో మంగళవారం బోరు తవ్వకం పనులను చేపట్టారు. గత కొన్ని రోజుల నుంచి మంచినీటి కోసం దొండవాక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కూటమి నాయకులు హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం బోరు తవ్వకం పనులను ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు, కూటమి నాయకులు బి. దేవుడు, జగ్గా రమణ, సత్యం, చిన్న తదితరులు పాల్గొన్నారు


నెహ్రూచౌక్‌లో ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న దృశ్యం

అమరావతి మహిళలను కించపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోండి

తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి

తుమ్మపాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి కించపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు అనకాపల్లి మెయిన్ రోడ్డుపై మంగళవారం అధిక సంఖ్యలో మహిళలతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా భారీ ర్యాలీ చేశారు. అలాగే నెహ్రూచౌక్ జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేశారు. అనంతరం రత్నకుమారి మాట్లాడుతూ ఆది నుంచి అమరావతిపై వైసీపీ చులకన భావం కలిగి ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సైతం అమరావతిపై ఐదేళ్ల పాటు కక్ష కట్టి పాలన సాగించారన్నారు. ప్రస్తుతం సాక్షి డిబేట్‌లో న్యూస్ రిపోర్టర్లు కృష్ణంరాజు, కె.శ్రీనివాసరావు అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి కించపరిచారని ఆరోపించారు. వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు మాట్లాడుతూ సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. జగన్‌రెడ్డి, భారతిలు అమరావతి మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతి మహిళలతో పాటు రాష్ట్రంలో ఉన్న మహిళా లోకాన్ని చులకన భావంతో చూస్తున్న వైసీపీ నేతలను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకులు శంకర్ల పద్మలత, పెదపాటి కళ్యాణి, బత్తుల లక్ష్మి, కె.ఈశ్వరమ్మ, మేడిశెట్టి రాధ, కాయల ప్రసన్నలక్ష్మి, మళ్ల అమ్మాజీ, పాలపర్తి తులసీ, సత్యవతి, శ్రీలత పాల్గొన్నారు.

వైసీపీ మహిళా నేతల నిరసన


భీమునిగుమ్మం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

అనకాపల్లి టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న దాడులపై వైసీపీ మహిళా విభాగం ప్రతినిధులు మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. మహిళలకు, బాలికలకు చంద్రబాబు పాలనలో భద్రత కరువైందంటూ నినాదాలు చేస్తూ రింగురోడ్డులోని వైసీపీ కార్యాలయం నుంచి భీమునిగుమ్మం అంబేడ్కర్ విగ్రహం వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సుజాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలు, బాలికలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. కార్యక్రమంలో వైసీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి, వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో శివాలయం నిర్మాణానికి విరాళం


ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న బాదిరెడ్డి లక్ష్మణ

సబ్బవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సబ్బవరంలో శివాలయం నిర్మాణానికి మెడికల్ దుకాణం యజమాని బాదిరెడ్డి లక్ష్మణ రూ.85,116 విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నాగేశ్వరరావు, ప్రకాశ్, గెడ్డం కృష్ణ, దెడ్డం ప్రసాదరావు, కొల్లి కృష్ణ, బర్ల రమణ, పల్ల తాతారావు, కోన సోమేశ్వరరావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

పరవాడలో మోస్తరు వర్షం


పరవాడ రహదారిపై కురుస్తున్న వాన

పరవాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. సుమారు రెండు గంటలకు పైగా వాన పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఎండలతో అల్లాడిపోయిన ప్రజానీకానికి ఈ వర్షం కాస్త ఊరటనిచ్చింది. కాగా ఈ వర్షం కూరగాయల పంటలకు ఊపిరి పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా వర్షం కారణంగా వారపు సంతకు వచ్చే వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. దుకాణాలను రోడ్డుపై ఏర్పాటు చేయడంతో రాకపోకలు సాగించే వాహనదారులు అవస్థలు పడాల్సి వచ్చింది.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు


బాలకృష్ణ జన్మదిన కేకును కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

అనకాపల్లి టౌన్/తుమ్మపాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్, బాలకృష్ణ, ఎన్టీఆర్ అభిమాన సంఘం గౌరవాధ్యక్షులు పొలిమేర నాయుడు, టీడీపీ నేత మాదంశెట్టి నీలబాబు కేకు కట్ చేసి అందరికీ పంచారు. తుమ్మపాల టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కేవీ.సన్యాసినాయుడు బాలకృష్ణ జన్మదిన కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు ఎ.గోవిందరావు, పి.బలరాం, సింహాచలం, ఎన్.బోసుబాబు, కె.రమణబాబు, జి.శ్రీనివాసరావు, పి.బుజ్జి పాల్గొన్నారు.

ఎక్కడి నీరు అక్కడే..!

చినుకు పడితే పట్టణం చిత్తడి

- ఎక్కడికక్కడే నిలిచిపోతున్న వర్షం నీరు
- రహదారులపై ఏరులై పారుతున్న వరద
- మురికి కూపంలా జీవీఎంసీ కార్యాలయ ప్రాంగణం
- పలు ప్రాంతాలు ఛిద్రం.. పట్టణ ప్రజలకు నరకం

చినుకుపడితే పట్టణం చిత్తడవుతోంది. ఎక్కడికక్కడే వర్షం నీరు నిలిచిపోతోంది. రహదారులపై వరద ఏరులై పారుతోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపిస్తోంది. మరికొన్ని ప్రాంతాలు ఛిద్రమై ప్రజలకు నరకం కనిపిస్తోంది. అయినప్పటికీ అధికారుల్లో చలనం లేకపోతోంది.


భీమునిగుమ్మం వద్ద రోడ్డుపై ఏరులా పారుతున్న నీరు


ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో చెరువును తలపిస్తున్న నీరు

అనకాపల్లి టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత ప్రాధాన్యం ఇవ్వాల్సిన జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణ చాలా వరకు మురికికూపంగా మారింది. కార్యాలయ ఆవరణలోనే డంపింగ్ యార్డు ఉండడంతో యార్డుకు పట్టణంలో సేకరించిన చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి వేసే సమయంలో ఈ మార్గమంతా మురికి కూపంగా మారుతోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వర్షం పడితే ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతోంది. నీరు పోవడానికి సరైన మార్గం లేకపోవడంతో భారీ వర్షం కురిసినప్పుడు మూడు, నాలుగురోజుల వరకు నీరు నిల్వ ఉండిపోయి చెరువులా మారుతోంది. దీంతో డిపోలోకి వెళ్లే గ్యారేజీ కార్మికులు, అధికారులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కూడా ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. కార్యాలయ ఆవరణలోని రహదారిపై గుమ్ముల్లో నీరు ఉండిపోయి చెరువులను తలపిస్తున్నాయి. అలాగే ఈ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో కార్యాలయం, డీఆర్‌డీఏ కార్యాలయం, ట్రెజరీ కార్యాలయాలు కూడా ఉన్నాయి. ఈ కార్యాలయాలకు రాకపోకలు సాగించే ప్రజలు నీటి నిల్వల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ప్రధాన రహదారుల్లో కూడా వర్షపునీరు ఏరులై పారుతోంది. దీంతో పాదచారులు నరకం చూస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యాలయం, భీమునిగుమ్మం, నరసింగరావుపేట, విజయరామరాజుపేట తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్ల పక్కన నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.


తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని గుమ్ముల్లో నిలిచిపోయిన నీరు



మురికికూపంగా ఉన్న జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణ, ప్రాంగణం

ముగిసిన కిశోరి వికాసం శిక్షణ తరగతులు

కొత్తూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. గత నెల 2వ తేదీన ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రారంభించారు. అనకాపల్లి పట్టణంలోని మాధవసదన్ కమ్యూనిటీ హాలులో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎస్.సూర్యలక్ష్మి, అదనపు ఎస్పీ మోహన్‌రావు, డీఎంహెచ్‌వో బాలాజీ తదితరులు ప్రసంగించారు. 11 నుంచి 18 ఏళ్ల లోపు బాలబాలికలు 20 మందిని ఒక గ్రూపు చొప్పున ఏర్పాటుచేసి వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. కిశోరి ఆరోగ్యం, విద్య, రక్షణ, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, సీడీపీవో పి.ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట: మండల కేంద్రంలోని సామాజిక భవనంలో కిశోరి వికాసం శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ పెదపాటి కల్యాణి మాట్లాడుతూ కౌమార వయస్సు బాలికల ఆరోగ్యం, ఆత్మ విశ్వాసంతో పాటు భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఉన్నత విద్యను ప్రోత్సహించి బాల్యవివాహాలు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఏఎస్‌ఐ కె.రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.ఝాన్సీరాణి, మహిళా పోలీసు జయభారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తూరు: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి.. అనకాపల్లి రూరల్: మారేడుపూడిలో మహిళలు, బాలికలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మారేడుపూడిలో...

అనకాపల్లి రూరల్: మండలంలోని మారేడుపూడి గ్రామంలో బడి బయట ఉన్న 11 నుంచి 18 ఏళ్ల వయస్సు గల బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులు, పోక్సో చట్టం, రక్తహీనత నివారణ, సైబర్ నేరాలు, లింగవివక్ష తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈగల ధనలక్ష్మి, జోగా మహాలక్ష్మి పాల్గొన్నారు.

తుమ్మపాలలో...

తుమ్మపాల: మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాలికల సంపూర్ణ ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని, కిశోరి బాలికల సాధికారితపై బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, ఎంపీ టీసీ సభ్యులు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నీటి సరఫరాలో అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె

- జీతాల పెంపునకు చాలాకాలంగా డిమాండ్
- ఆరు నెలల కిందట కౌన్సిల్ ఆమోదం
- ఆడిట్ అభ్యంతరంతో నిలిచిపోయిన వైనం
- నేటి నుంచి విధులు బహిష్కరిస్తున్నట్టు కలెక్టర్‌కు నోటీసు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలోని అవుట్ సోర్సింగ్ కార్మికులు బుధవారం నుంచి సమ్మెకు దిగుతున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు మంగళవారం సమ్మె నోటీస్ అందజేశారు. సమ్మె కారణంగా నగరంలో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికుల్లో కనీసం పదేళ్ల అనుభవం కలిగి, టెక్నికల్ విధులు నిర్వర్తిస్తున్న 900 మందికి రూ.ఆరు వేలు చొప్పున వేతనం పెంచాలని కార్మిక సంఘాలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై గత ఏడాది డిసెంబరులో జరిగిన కౌన్సిల్ సమావేశంలో లోతుగా చర్చించిన సభ్యులు వేతనాల పెంపునకు ఆమోదం తెలిపారు. ఇన్‌చార్జి కమిషనర్ కూడా ఆమోదించారు. ఈ మేరకు ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి రూ.6 వేల చొప్పున మే నెల నుంచి పెంచుతూ బిల్లును ఆప్కోస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. జీతాలను జీవీఎంసీ సాధారణ నిధులు నుంచి చెల్లించాల్సి ఉంటుంది కాబట్టి, బిల్లు ఆడిట్ విభాగానికి రాగా, అక్కడి అధికారులు పరిశీలించి, కౌన్సిల్, ఇన్‌చార్జి కమిషనర్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కూడా ఉండాలని పేర్కొంటూ తిరిగి ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు పంపించింది. దీంతో వారి జీతాల పెంపు నిలిచిపోయింది. అయితే వారికి గతంలో మాదిరిగా జీతం ఇవ్వడానికి కూడా సాంకేతికంగా ఇబ్బంది రావడంతో ఈనెల ఒకటిన జీతాలు జమ కాలేదు. ఆ 900 మంది కార్మికులకే కాకుండా మిగిలిన సుమారు ఏడు వేల మంది అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కూడా జీతాలు నిలిచిపోవడంతో అంతా గగ్గోలు పెడుతున్నారు. తమకు జీతాలు పెంచేందుకు కౌన్సిల్‌తోపాటు ఇన్‌చార్జి కమిషనర్ ఆమోదించినప్పటికీ రాష్ట్రప్రభుత్వ ఆమోదం కావాలని కోరడం సరికాదని, తమకు పెరిగిన జీతాలను మే నెల నుంచి ఇవ్వకపోతే బుధవారం నుంచి సమ్మెకు దిగుతామని పేర్కొంటూ జీవీఎంసీ కాంట్రాక్టు మరియు అవుట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎం.ఆనందరావు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.01 గంటలకు కార్మికులంతా టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని ప్రధాన పంప్‌హౌస్ వద్దకు చేరుకోవాలని వాటర్‌సప్లై కార్మికులకు పిలుపునిచ్చారు. మరోవైపు సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి సైతం నీటి సరఫరా విభాగంలో స్కిల్డ్ విధులు నిర్వర్తిస్తున్నవారికి జీతాలు పెంపుదల అమలుచేయాల్సిందేనని, లేనిపక్షంలో తాము కూడా సమ్మెకు దిగుతామని పేర్కొంటూ అధికారులకు నోటీసు అందజేశారు. దీంతో బుధవారం నుంచి నగరంలో నీటి సరఫరాకు అంతరాయం కలగడం ఖాయమని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

తాగునీటి వృథాకు అడ్డుకట్ట

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

పరవాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి వృథాకు సంబంధిత అధికారులు అడ్డుకట్ట వేశారు. పరవాడ ప్రధాన మార్గంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలో పైప్‌లైన్‌కు రంధ్రం ఏర్పడడంతో గత కొన్ని రోజులుగా తాగునీరు వృథాగా పోతుండడంతో 'పైప్‌లైన్‌కు రంధ్రంతో తాగునీరు వృథా' అనే శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్ పర్యవేక్షణలో మంగళవారం పైప్‌లైన్‌కు మరమ్మతు చేసి తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేశారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల రక్తదాన శిబిరం


శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్, ఇతర సిబ్బంది

సబ్బవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం జరిగింది. ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం-6, యువశక్తి క్యాంప్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తదానం చేయడం ద్వారా మరికొందరికి ప్రాణదానం చేయవచ్చని ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిమ్ ప్రభాత్ పేర్కొన్నారు. అలాగే రక్తదానం చేస్తే మనిషికి నూతన కొత్త శక్తి వస్తుందన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి రవికుమార్, డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. ఈ శిబిరంలో 48 యూనిట్లు రక్తం సేకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. అనంతరం స్థానిక ఫైరాఫీసర్ జీవీ సత్యరాజ్ ఫైర్ సేఫ్టీ గురించి క్యాడెట్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ శ్రీనివాసరావు, డాక్టర్ ప్రసాద్, రవికుమార్, హెచ్‌సీ శివప్రసాద్ పాల్గొన్నారు.

శాప్ సభ్యుడిగా పీబీవీఎస్ఎన్ రాజు



సబ్బవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సబ్బవరానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పీబీవీఎస్ఎన్.రాజు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్ఏఏపీ) సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం శాప్ కార్యదర్శి వినయ్‌చంద్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ. రాష్ట్రంలో ఎనిమిది మంది సభ్యులు ఉండగా, విశాఖ జిల్లా నుంచి తనకు అవకాశం లభించందని చెప్పారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, శాప్ చైర్మన్ రవినాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి

అనకాపల్లి టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 82వ వార్డులో సమస్యలను విశాఖ మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని కార్పొరేటర్ మందపాటి సునీత చెప్పారు. మంగళవారం జీవీఎంసీ సిబ్బంది, వైసీపీ నేతలతో కలిసి వార్డు పరిధిలోని పూడిమడకరోడ్డులో ఉమ్మలాడకు వెళ్లే మార్గంలో పర్యటించారు. ఉమ్మలాడకు వెళ్లే జంక్షన్‌లో అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి, మెరుగుపరచడానికి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, వైసీపీ నాయకులు గైపూరి రాజు, దాడి భోగలింగేశ్వరరావు, గొన్నాబత్తుల రమణ, పోలమరశెట్టి ఓంశివ, మళ్ల స్వామి, జీవీఎంసీ శానిటేషన్, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డిపో ఏర్పాటు చేయరూ...

సబ్బవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అందుబాటులో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని ఇరువాడ శివారు ఎస్సీ బీసీ కాలనీ, కుమ్మరి కాలనీ మహిళలు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ చిన్నికృష్ణకు మంగళవారం వినతిపత్రం అందించారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని ఇరువాడ గ్రామానికి వెళ్లి రేషన్ తీసుకుంటున్నామని వాపోయారు. తహసీల్దార్ స్పందించి తమ మూడు కాలనీలకు అందుబాటులో డిపో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.సంతోషి, జి.రాములు, సన్యాసమ్మ, ఈశ్వరమ్మ, పుష్పలత, శ్రీనివాసరావు, నూకరత్నం, ఎం.లక్ష్మి, ఎం.మహాలక్ష్మి, పి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా చక్రవర్తి

అనకాపల్లి టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా కె.చక్రవర్తి నియమితులయ్యారు. ఆయన వ్యవసాయ శాఖలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. విశాఖ ప్రధాన కార్యాలయంలో సెక్రటరీగా చేస్తున్న బీవీ.రమణ ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. రెండు రోజుల్లో కమిషనర్‌గా చక్రవర్తి బాధ్యతలు చేపడతారని సమాచారం. గతంలో కొన్ని రోజులు ఆయన ఇన్‌చార్జిగా పనిచేశారు.

ఎండీఎం కార్మికుల బిల్లుల విడుదల చేయాలి

తుమ్మపాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ఏపీ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబీకులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఆయన కోరారు.

వైభవంగా నూకాంబిక పండుగ


పూజలందుకున్న అమ్మవారు

పరవాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెం పంచాయతీలో హస్తనాపురం ప్రజల ఆరాధ్య దైవం నూకాంబిక అమ్మవారి పండుగ మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలు గ్రామ వీధుల్లో ఊరేగించారు. సర్పంచ్ వరలక్ష్మి, సీతారామయ్య దంపతులు, స్థానిక నాయకులు ఆర్.గంగరాజు, సన్యాసినాయుడు, కృష్ణారావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పెదమాకవరం విద్యార్థినికి షైనింగ్ స్టార్స్ అవార్డు



మంత్రి రవీంద్రనుంచి పురస్కారం అందుకుంటున్న వసుపరి జోయసి

కొయ్యూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డుకు ఎంపికైన మండలం లోని పెదమాకవరంగ్రామానికి చెం దిన వసుపరి జోయసి సోమవారం మంత్రి కొల్లు రవీం ద్రనుంచి పురస్కారాన్ని అందుకుంది. తాళ్లపాలెం సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో చదివిన జోయసి ఇంటర్‌లో 967/1000 మార్కులు సాధించి అనకాపల్లి జిల్లా టాపరుగా నిలిచింది. గిరిజన విద్యార్థిని జోయసి జిల్లా టాపరుగా నిలిచి ఈ ప్రాంతానికి గుర్తింపు తేవడంపై ఆమెతోపాటు తల్లిదండ్రులు బాలకృష్ణ, సువర్ణలను పలువురు అభినందించారు.

కొయ్యూరులో 37.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

పాడేరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు మాత్రం కొనసాగుతున్నాయి. దీంతో ఏజెన్సీ వాసులు ఎండ ప్రభావానికి ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మంగళవారం కొయ్యూరులో 37.7 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా పాడేరులో 35.3, జీకేవీధిలో 34.4, అనంతగిరిలో 33.6, పెదబయలులో 33.4, డుంబ్రిగుడలో 32.1, హుకుంపేటలో 31.5, చింతపల్లిలో 31.4, జి.మాడుగులలో 31.3, అరకులోయలో 31.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పాడేరు ఆస్పత్రిలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

పాడేరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో నీటి సమస్యను పరిష్కారానికి చర్య తీసుకోనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. విశ్వామిత్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న రెండు మోటార్లలో ఒకటి మరమ్మతులకు గురైందని, దీంతో నీటికి ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు రోగులకు సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో వెంటనే స్పందించి మోటారును బాగు చేయించి నీటి సరపరా పునరుద్ధించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆమె ఆదేశించారు. రెండు రోజుల్లో మోటారు మరమ్మతులు పూర్తి కానున్నాయని, అప్పటి వరకు రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆస్పత్రిలోని వార్డులకు టాంకర్ల ద్వారానీటినిసరఫరాచేసేలా చర్యలు చేపట్టామన్నారు.

శరవేగంగా గుమ్మ-పోర్లువలస రింగు రోడ్డు పనులు

» సుమారు 11.4 కిలో మీటర్లకు రూ. 11 కోట్లు మంజూరు

» 10 గ్రామాల గిరిజనులకు తీరనున్న వెతలు

అనంతగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో మారుమూల గ్రామాల రహదారులను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని గుమ్మ పంచాయతీ నుంచి పలు గ్రామాలను కలుపుతూ పోర్లువలస వరకు సుమారు 11.4 కిలో మీటర్ల మేర రూ. 11 కోట్లతో రింగురోడ్డు పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం ఈ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఈ గ్రామాలకు స్వాతంత్ర్యం వచ్చిననాటినుంచి రహదారి లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ స్థితిలో కూటమి ప్రభుత్వం రోడ్డు నిర్మాణం చేపడుతుండంతో గిరిజనుల ఆనందం వ్యక్తంచేస్తున్నారు. రోడ్డు సౌకర్యం లేక నిమ్మఊట, దిగుముల్లేలు,



బూసిపాడు సమీపంలో రోడ్డుపై గ్రావెల్ ఫిల్లింగ్



రింగురోడ్డు నిర్మాణం

ఎగుముల్లేలు, మిర్కిదుంగడ, మద్దిపాడు, బూసిపాడు, కరకవలస, పోర్లువలస గ్రామాల గిరిజనులకు అనారోగ్యం బారిన పడితే డోలీమోతలే దిక్కయ్యే వి. కొండలపై నుంచి దట్టమైన అటవీమార్గం మీదుగా రోగులను, గర్భిణులను తరలించాల్సిన దుస్థితి నెలకొనేదని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేశారు.కూటమి ప్రభుత్వంలో రింగురోడ్డు నిర్మాణం చేపడుతుండడంతో ఆయా గ్రామాల గిరిజనులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

'ఉత్కర్ష అభియాన్'పై అవగాహన కల్పించండి

» ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు

పాడేరురూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ధారతీ అభాజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డీఏ జుగా)పై గిరిజనులకు అవగాహన కల్పించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన వైద్య ఆరోగ్య శాఖ, వీడీవీకే, గ్యాస్, పంచాయతీరాజ్, బ్యాంక్ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఐసీడీఎస్, జీసీసీ, వ్యవసాయ శాఖ, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో పథకం అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ పరిధిలో 260 గ్రామాలు డీఏ జుగా పథకం అమలుకు ఎంపికయ్యాయన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో అవగాహ న సదస్సులు నిర్వహించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఆధార్, ఆయుష్మాన్ భారత్ కార్డులు, పీఎం ఆవాస్ యోజన పథకంలో పక్కా గృహాలు, పాఠశాలలు, ఏకలవ్య మోడల్ పాఠశాలల భవనాల నిర్మాణాలు, వైద్య ఆరోగ్యసేవలు అందించాలన్నారు. ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం కింద ఇళ్ల నిర్మాణదారులకు ఆర్థిక లబ్ధి కల్పించాలన్నారు. లబ్ధిదారులను గుర్తించి పీఎం ఉజ్వల పథకంలో గ్యాస్ కనెక్షన్లు అందించాలన్నారు. ప్రతీ కుటుంబానికి బ్యాంక్ ఖాతాలు ప్రారంభించాలన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారులు, విద్యుత్, తాగునీటి సౌకర్యం, పాఠశాలల్లో మౌలిక కల్పించాలని సూచించారు. నిరుద్యోగ గిరిజన యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించాలన్నారు. గ్రామ ఉత్కర్ష అభియాన్‌ను సమర్థంగా అమలుకు జి ల్లా, మండల, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు . గ్రా మ సభలు నిర్వహిస్తున్న ముందు రోజు దండోరా వేయించాలన్నారు. అదే విధంగా స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. అ న్ని శాఖల అధికారులు సమన్వయంతో గిరిజనాభివృద్ధికి కృషి చే యా లన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ బి.బాబు, జిల్లా అదనపు వైద్యాధికారి టీఎస్ ప్రతాప్, ఎల్‌డీఎ మాతునాయుడు, ఐటీడీఏ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ ఎం.శ్రీని వాసకుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ పి.ఝాన్సీరాణి, డీఎల్‌పీవో పీఎస్ కుమార్, పీఎంయూ అధికారులు కె.రాజేశ్, వి.లోహిత్, 11 మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో వెంకటేశ్వరరావు

విజృంభిస్తున్న జ్వరాలు

» గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అభ్యర్థన



హుకుంపేట పీహెచ్‌సీలో రోగుల తాకిడి

హుకుంపేట జూన్ 10 ఆంధ్రజ్యోతి: వాతావరణం మార్పులతో గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. మండలంలోని 33 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో పలువురు గిరిజనులు మంచం పడుతున్నారు. గత నెలలో వర్షాలు కురవడం.. ప్రస్తుతం కొద్దిరోజులుగా ఎండలతో వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో జ్వరాలు, జలుబు తదితర వాటితో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. దూరాభారం నుంచి మండల కేంద్రానికి జ్వరాలతో బాధపడుతూ వస్తున్నారు. వృద్ధులు, ఆర్థిక సమస్యల్లో ఉన్న గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్న ఇళ్లకే పరిమితవుతున్నారు. హుకుంపేట ప్రాథమిక కేంద్రానికి వైద్యం కోసం వచ్చినా, ఒక్క రోజులో జ్వరం తగ్గే పరిస్థితి ఉండడంలేదు. దీంతో మండల కేంద్రంలో 24 గంటలు ఆస్పత్రిలో సేవలందించేలా చూడాలని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. అలాగే, అధికారులు స్పందించి గ్రామాల్లోనే అందుబాటులో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలందించాలని కోరుతున్నారు.

అధ్వానంగా పిల్లిగెడ్డ వంతెన అప్రోచ్ రోడ్డు

» ఏవోబీ సరిహద్దులో రాకపోకలకు అవస్థలు



వంతెనకు అప్రోచ్‌కు బీటీ వేయకుండా వదిలేసిన దృశ్యం

సీలేరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లోని పిల్లిగెడ్డ వంతెన అప్రోచ్‌కు బీటీ రోడ్డు వేయాలని సరిహద్దు ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ వంతెనకు అప్రోచ్ బీటీ రోడ్డుగా మార్చకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ఇరువైపులా వేసిన ఎర్రమట్టి బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంటోంది. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఈ వంతెన నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. అప్రోచ్ పనులు పూర్తి స్థాయిలో నిర్వహించకుండా వదిలేశారు. దీంతో వర్షం కురిసిన ప్రతిసారి వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని ఈ వంతెనపై నుంచి ఒడిశాలోని చిత్రకొండ, మల్కన్‌గిరి, జైపూర్, కోరాపుట్ ప్రాంతాలతోపాటు ఆంధ్రా పరిధి నర్సీపట్నం, విశాఖపట్నం, రాజమండ్రి ప్రాంతాలకు వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. గెడ్డ అప్రోచ్ వద్ద వర్షాలతో ఏదైనా వా హనం దిగబడితే ఆంధ్రా- ఒడిశా రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని ఈ ప్రాంతీయులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పిల్లిగెడ్డ వంతెన అప్రోచ్‌కు బీటీ వేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కిశోర బాలికల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి: ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారులు కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ ముగింపు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ ఐసీడీఎస్ అధికారులు కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా మే రెండోవ తేదీ నుంచి పలు కార్యక్రమాలు గ్రామ స్థాయి అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ నిర్వహించారన్నారు. ప్రధానంగా కిశోర బాలికలు విద్యాభ్యాసం చేయాలన్నారు. బాల్య వివాహాలు చేసుకోరాదన్నారు. అపరిచిత పరిచయాలు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్‌కి దూరంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, శరీరంలో కలిగే మార్పుపై చైతన్య వంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాలను ఐసీడీఎస్ అధికారులు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. బాలికలను చదువులో రాణించేలా తల్లిదం డ్రులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, తహసీల్దార్ టి. రామకృష్ణ, ఐసీడీఎస్ సడీపీవో జీవీ రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి పాల్గొన్నారు.

12న సీపీఐ మహా సభ

కొయ్యూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మం డల మహాసభ ఈ నెల 12న రావణాపల్లిలో నిర్వహించనున్నట్టు పార్టీ మండల కార్యదర్శి ఇరవాడ దేముడు తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అధ్యక్షతన జరుగనున్న ఈ సభకు రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి, కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, అనకాపల్లి జిల్లా కార్యదర్శి రామునాయుడు పాల్గొంటారన్నారు.కార్యకర్తలు, అభిమా నులు, నాయకులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో స్థానిక ఎస్‌ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను మంగళవారం తనిఖీ చేపట్టారు.. మవోయిస్టులు భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలోని పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా అప్రమత్తమయ్యారు. మండల కేంద్రం మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలను ఆపి క్షుణంగా తనిఖీ చేశారు. అనుమానితులను ప్రశ్నించిన మీదుట విడిచి పెట్టారు. రాత్రి వేళల బస్సు సర్వీసులు ముచంగిపుట్టు వరకే పరిమితం చేశారు.



ముంచంగిపుట్టులో వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

జోరుగా ఉపాధి హామీ పథకం పనులు

హుకుంపేట జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకం పనులు గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి. మండలంలోని 33 పంచాయతీల పరిధిలో చేపడుతున్న ఆయా గ్రామాలకు చెందిన కూలీలు, రైతులు ఈ పనుల్లో పాల్గొంటున్నారు. ఈ పనుల వేతనాలతో తమ అవసరాలు తీరనున్నట్టు వారు ఆనందం వ్యక్తంచేశారు. ఖరీఫ్ వ్యవసాయ పనులు, తమ పిల్లలకు పాఠశాలకు పంపించేందుకు, నిత్యావసరాల కొనుగోలుకు తదితర ఖర్చులకు ఉపయోపడతున్నట్టు చెబుతున్నారు.

అయితే, 200 రోజులపాటు పని కల్పిస్తే మరింత బాగు ఉంటుందని కూలీలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. గ్రామాలనుంచి వలస వెళ్లే పరిస్థితి ఉండదని పలు గ్రామాల ప్రజలు తెలిపారు. ముల్యపుట్టు గ్రామాల్లో చెరువు పనులు చేపడుతుండడంతో తమ పొలాలకు మరింత నీరు అందుతుందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు.



మల్యపుట్టులో చెరువు పనులు చేపడుతున్న కూలీలు

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభాలు

» ఘాట్ రోడ్డులో ప్రయాణికుల ఆందోళన



శివలింగపురం నుంచి తైడ వరకు రోడ్డునుఆనుకునిఉన్న విద్యుత్ స్తంభాలు

అనంతగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్‌రోడ్డు శివలింగపురం నుంచి తైడ వరకు రోడ్డుకు ఆనుకుని విద్యుత్ స్తంభాలు ప్రమాదభరితంగా మారాయి.. దీంతో భయంతో వాహనాలను నడపాల్సిన పరిస్థితి నెలకొంది. అరకు-విశాఖ ప్రధాన రహదారి కావడంతో తరచూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తైడ వద్ద రెండో రైల్వేలైన్ పనులకు సంబంధించి, శివలింగపురం నుంచి తైడ వరకు విద్యుత్ స్తంభాలను వేసి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్డు ఆనుకుని పెద్ద ఎత్తున కోతకు గురైంది. రక్షణగోడకు మధ్యలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం.. అదుపుతప్పి వాహనాలు స్తంభాలను ఢీకొడితే... ప్రమాదాలను ఊహించలేమని, వాహనదారులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డుకు దూరంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తే.. ప్రమాదాలు ఉండవని, భావిస్తున్నారు.

బాలికలకు భవిష్యత్తు కల్పించాలి

డుంబ్రిగుడ జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలికలు ఉన్నత స్థాయిలో ఎదిగేలా ప్రోత్సహించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్ అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ ఆధ్వర్యంలో కిశోరివికాసం ముగింపు కార్యక్రమం జరిగింది. స్థానిక ఐసీడీఎస్‌కార్యాలయంలో సమావేశం అనంతరం ర్యాలీ చేపట్టారు. జాతీయ రహదారిలో మానవహారాన్ని చేపట్టి కొవ్వొత్తుల ప్రదర్శనతోపాటు బెలూన్లను ఎగుర వేశారు. బాలికలపట్ల అసమానతలు వీడి వారి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: జీకేవీధి మండలం ధారకొండలో కిశోరి వికాసం కార్యక్రమంపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ నడిగొట్ల రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలు, పోలీసు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజు మాట్లాడుతూ కిశోరి వికాసం శిబిరంను అధికారులు ఆదేశాలు మేరకు నిర్వహించామని పేర్కొన్నారు. లింగవివక్షకు వ్యతిరేకం, విద్య, నైపుణ్యం, ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్ నేరాలు, యోగాతో కలిగే లాభాలు తదితర అంశాలపై పూర్తిస్థాయిలో ఈనెల 2నుంచి గ్రామస్థులకు అవగాహన కల్పించమన్నారు. కౌమార దశలో ఉన్న పిల్లలపై తీసుకోవాలసిన జాగ్రత్తలుపై తల్లిదండ్రులు వివరించామన్నారు. చిన్నతనంలో వివాహాలు చేసుకుంటే కలిగే నష్టాలు గురించి పిల్లలకి అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మాడి రామన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ కార్యకర్తలు, సచివాలయసిబ్బంది, కిశోర వికాస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో మానవహారం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, ఆశలు



సీలేరు: ధారకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పనసలపాడులో అంగన్‌వాడీ భవన నిర్మాణం

» 30 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలం

» నూతన నిర్మాణంతో త్వరలో తీరనున్న వసతి సమస్య

కొయ్యూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రెండున్నర దశాబ్దాల అనంతరం పనసలపాడులో అంగన్‌వాడీ కేంద్రానికి భవన సౌకర్యం సమకూరనుంది. పీఎం జన్‌మన్ యోజన పథకంలో రూ. 10 లక్షల నిధులు మంజూరు కావటంతో భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ భవనం ఐదేళ్ల వ్యవధిలోనే శిథిలావస్థకు చేరింది. దీంతో గత 25 ఏళ్లుగా అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పీఎం జన్‌మన్ యోజన పథకంలో రూ. 10 లక్షల మేర నిధులు కేటాయించింది. దీంతో శిథిల భవనాన్ని తొలగించి నూతన నిర్మాణాలకు గానూ గత ఫిబ్రవరిలో కాంట్రాక్టరు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఇసుక, మెటల్ సిద్ధం చేశారు. నిధులు కేటాయించటంలో జరిగిన జాప్యాన్ని ఆసరాగా చేసుకున్న గ్రామానికి చెందిన వజ్రపు కృష్ణ అనే వ్యక్తి అంగన్‌వాడీ భవన స్థలానికి రెవెన్యూ అధికారులను మభ్య పెట్టి పట్టా చేయించుకున్నా డు. దీని ద్వారా నూతన భవన నిర్మాణాలకు పూనుకున్న కాంట్రాక్టరును అడుకున్నారు. చేసేది లేక కాంట్రాక్టరు మెటీరియల్ తిరిగి వేరే పనులకు తరలించుకునే చర్యలు చేపడుతుండగా నిర్మాణాలను అడ్డుకున్న వ్యక్తిపై గ్రామస్థులు తిరుగుబాటు చేశారు. పదేళ్ల క్రితం అప్పటి రెవెన్యూఅధికారులు కక్కుర్తి పడి చేసిన తప్పిదంతో నేడు అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు అ డ్డంకిగా మారడంపై మండిపడ్డారు. దీనిపై స్పందించిన స్థానిక తహసీల్దారు ప్రసాద్ సర్వేయర్‌ను పంపి స్థల పరిశీలన జరిపించి అవరోధాలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తిరిగిభవన నిర్మాణాలు పూర్తి చేయనున్నట్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.



అంగన్‌వాడీ భవన నిర్మాణాలలో భాగంగా శ్లాబ్ వేసిన దృశ్యం



శిథిలమైన పనసలపాడు అంగన్‌వాడీ కేంద్ర భవనం



ఏఎల్ పురంలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ పీవో శ్రీగౌరీ, కిశోర్ బాలికలు

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

» ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి

కృష్ణాదేవిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్నామని, ఇందుకోసం అందరూ సహకరించాలని గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి పిలుపునిచ్చారు. మంగళవారం మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో కిశోరి వికాసం వేసవి ప్రత్యేక శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ముందుగా గ్రామంలో ప్ల కార్డులతో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. అనంతరం మానవహారం నిర్వహించారు. అలాగే విద్య ఆవశ్యకత, బాల్య వివాహాల వల్లే కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో శ్రీగౌరి మాట్లాడుతూ బాలికలు ఉన్నతంగా రాణించాలని సూచించారు. ప్రధానంగా విద్య ఆవశ్యకత గురించి తెలుసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రాల్లో అవకతవకలు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు సత్యశ్రీ, రాఘువ, సిబ్బంది కిరణ్, అంగన్‌వాడీ కార్యకర్తలు మంగ, ధనలక్ష్మి, విజయకుమారి, రాజకుమారి, భవాని తదితరులు పాల్గొన్నారు.

మహిళలు హక్కులను రక్షించుకోవాలి

» ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హైమావతి, రమ్య



రోలుగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, మహిళలు

రోలుగుంట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ హక్కులను రక్షించుకోవడంపై అవగాహన కల్పించుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు హైమావతి, రమ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కిశోరి బాలికా వికాస ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మహిళల ఆరోగ్యం, పోషణ రుతుక్రమంలో పాటించాల్సిన శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

మండలంలోని దిబ్బిడిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నం మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు దాటిన తర్వాత పెళ్లి పేరుతో చదువును ఆపివేస్తున్నారన్నారు. ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో దిబ్బిడి సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సరస్వతీ జంక్షన్ రహదారికి మోక్షం

రూ.5.76 కోట్ల వీఆర్‌ఆర్‌డీఏ నిధులతో కొత్త రోడ్డు నిర్మాణం

గతుకుల సమస్య నుంచి గట్టెక్కిన వాహన చోదకులు, ప్రయాణికులు





సరస్వతీ జంక్షన్ వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు... నాడు అధ్వానంగా ఉన్న మార్గం

నర్సీపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ జంక్షన్ వీధిలో రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. రోడ్డుకు ఇరువైపులా స్టేషనరీ, పుస్తకాలు, ఫ్యాన్సీ షాపులు అధికంగా ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు రాకపోకలతో ఈ ప్రాంతం నిత్యం రద్దీ ఉంటుంది. పాఠశాలలు తెరుచుంటే కొనుగోలుదారులతో కిక్కిరిసి పోతుంది. ఏళ్ల తరబడి రోడ్డు గతుకులు పడి అధ్వానంగా ఉండేది. ఈ వీధిలో మూడు రోడ్ల కూడలి వద్ద కల్వర్టు ఎత్తుగా ఉండి ద్విచక్ర వాహనాలు రాకపోకలకు ఆటంకంగా మారింది. అంతేకాకుండా తరచూ ప్రమాదాలు జరిగేవి. 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ చొరవతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ.5.76 లక్షల వీఎంఆర్‌డీఏ నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఇటీవల రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. కల్వర్టు ఎట్టుకు సరిపడేట్టు రోడ్డు రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వాహనాలు రాకపోకలకు అనుకూలంగా ఉండటంతో వ్యాపారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిరకాలంగా ఉన్న రోడ్డు, కల్వర్టు సమస్యకు పరిష్కారం దొరికిందని పేర్కొన్నారు.

వారపు సంతలో చింతలెన్నో..!

ఆదాయం ఘనం.. అభివృద్ధి శూన్యం » ఆరుబయట దుకాణాల నిర్వహణ

కనీస సదుపాయాల లేమితో వ్యాపారులు, వినియోగదారుల అగచాట్లు



కనీస సదుపాయాలు లేక ఖాళీగా ఉన్న సంత స్థలం

మాకవరపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం నిర్వహిస్తున్న వారపు సంతలో అనేక సమస్యలతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సంతకు ఏడాదికి లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా మండల పరిషత్ అధికారులు ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మాకవరపాలెంలో మంగళవారం జరిగే సంతకు 30 పంచాయతీల నుంచి కొనుగోలుదారులు వస్తారు. సంతలో వలిక వసతులు కల్పించకపోవడంతో రహదారులపైనే దుకాణాలు పెట్టుకుని సంత నిర్వహిస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.



రహదారిపైనే దుకాణాలు పెట్టుకుని సంత నిర్వహిస్తున్న వ్యాపారులు, రైతులు

అయినప్పటికీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఏటా రూ.3 లక్షల ఆదాయం వస్తున్నా సంతలో వసతులు లేకపోవడంతో వ్యాపారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపైనే సంత నిర్వహణతో ఎండావానకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంతలో వసతులు కల్పించాలని కోరారు.

జనసేనలోకి 60 కుటుంబాలు చేరిక

కృష్ణాదేవిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని లింగంపేట గ్రామంలో వైసీపీ నుంచి సుమారు 60 కుటుంబాల వారు మంగళవారం జనసేన పార్టీలో చేరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిచ్చారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సేవా కార్యక్రమాలు నచ్చి పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సలాదుల ప్రసాద్, దుంగల రమేష్, బి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వీరసూర్యచంద్ర

నర్సీపట్నం అటవీ శాఖ రేంజ్ అధికారిగా రాజేశ్వరరావు



రాజేశ్వరరావు

నర్సీపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ నర్సీపట్నం రేంజ్ అధికారిగా కర్రి వెంకట రాజేశ్వరరావు నియమితులయ్యారు. ఈయన గతంలో కేడీపేట డీఆర్‌వో పని చేస్తూ పదోన్నతిపై పెదబయలు రేంజర్‌గా వెళ్లారు. సాధారణ బదిలీలలో భాగంగా ఇప్పుడు నర్సీపట్నం రేంజర్‌గా నియమితులయ్యారు. ఇక్కడ రేంజ్ అధికారిగా పనిచేస్తున్న లక్ష్మీనర్సు పార్వతీపురం బదిలీ అయ్యారు.

113 పింఛన్లు మంజూరు

గొలుగొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 113 పింఛన్లు మంజూరు చేసినట్టు ఎంపీడీవో మేరీరోజీ మంగళవారం తెలిపారు. స్పౌజ్ కోటాలో ఈబ పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నెల 13వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో వద్ద లబ్ధిదారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు కొత్త పింఛన్లు పంపిణీ చేస్తారని ఆయన వివరించారు.

బంజరు భూములకు పట్టాలు ఇవ్వాలని ధర్నా

నాతవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పి.జగ్గంపేట, పీకే గూడెం, కేవీ శరభవరం గ్రామాల్లో బంజరు, అటవీ భూములలో సాగులో ఉంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నా నిర్వహించారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరమణ మాట్లాడుతూ ఏళ్ల తరబడి సాగులో ఉంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. నిరుపేదలకు మూడు సెంట్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు మంజూరు చేయాలని కోరారు. నాయకులు ఎ.చిన్నయ్య నాయుడు, ఇరటా అప్పారావు, ఎం.రామునాయుడు, జి.గురుబాబు కె.భవానీ పాల్గొన్నారు.

స్పీకర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

నాతవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 12న స్పీకర్ అయ్యన్నపాత్రుడు పర్యటించనున్నారు. ఈ మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, తాండవ ఛైర్మన్ సత్యనారాయణ ఏర్పాట్లు పరిశీలించారు. శెట్టి గోపీ, బి.సూరిబాబు, పి.సూరిబాబు, ఎస్.నానాజీ, శ్రీనివాస్, సీతారామ్మూర్తి, రామారావు, గంగరాజు, శెట్టి లోవ తదితరులు పాల్గొన్నారు.

చిలకవానిపాలెంలో బాలకృష్ణ జన్మదిన వేడుకలు



చిలకవానిపాలెంలో కేరింతలు కొడుతున్న బాలకృష్ణ యూత్ సభ్యులు

రావికమతం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు మంగళవారం మండలంలోని టి.అర్జాపురం పంచాయతీ శివారు చిలకవానిపాలెంలో ఘనంగా నిర్వహించారు. బాలయ్య యూత్ సంఘం అధ్యక్షుడు మచ్చా శ్రీను ఆధ్వర్యంలో దుర్గమ్మ ఆలయంలో బాలయ్య పేరున ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. జై బాలయ్య అంటూ అభిమానులు నినాదాలతో హోరెత్తించారు. అభిమానులు గ్రామస్థులకు స్వీట్లు పంచారు. గ్రామంలో గర్భిణులు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, గ్రామ సర్పంచ్ మడగల పాల్గుణ, బాలకృష్ణ యూత్ వైస్ ప్రెసిడెంట్ నీలిన రాము,సెక్రటరీ సతీష్, అర్జున, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

నాగయ్యపేటలో మొక్కల పెంపకం



నాగయ్యపేట గుడి వద్ద మొక్కలు నాటుతున్న దృశ్యం

దేవరాపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేట సన్యాసి చెరువు గట్టు, దుర్గాలమ్మ గుడి వద్ద ఆదర్శ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బి.త్రినాథరాజు, డ్వాక్రా మహిళలు మంగళవారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా వనం.మనం కార్యక్రమాన్ని చేపట్టారు. దుర్గామ్మ గుడి నుంచి ఆర్బీకే కేంద్రం వరకు అశోక, బాదం, తురాయి, రావి, వేప, రైన్‌ట్రీ వంటి మొక్కలు నాటారు. ఈసందర్భంగా త్రినాథరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజు కేకులు కట్ చేసి ఆర్భాటాలు చేసే కన్నా ప్రాణ వాయువును ఇచ్చే మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జామి ఉమ, శేషు, రాజులమ్మ, రాము, బొడ్డు సత్యవమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో మోస్తరు వర్షం



ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

మాడుగుల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి ఆకాశమంతా మబ్బులు పట్టి చిరుజల్లులతో మోస్తరు వర్షం పడింది. సోమవారం ఎండవేడిమి, ఉక్కపోతకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. మంగళవారం నెలకొన్న ముసురు వాతావరణం, వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు. చల్లని వాతావరణం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగన్ మీడియాపై పెల్లుబుకిన జనాగ్రహం

అమరావతి మహిళలపై దిగజారుడు వ్యాఖ్యలపై టీడీపీ ఆందోళన... చోడవరం పట్టణంలో ర్యాలీ



చోడవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, టీడీపీ నాయకులు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

చోడవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంత మహిళలపై జగన్ మీడియాలో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు, మహిళలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. సాక్షి మీడియా తీరుకు వ్యతిరేకంగా మహిళలు నినాదాలు చేశారు. పట్టణంలో ప్రదర్శన నిర్వహించిన మహిళలు తహసీల్దార్ రామారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. సాక్షి మీడియాను నిషేధించాలని, మహిళలను కించపరిచిన జగన్, సాక్షి మీడియా అధినేత భారతిలపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, మాజీ ఎంపీపీ పెద బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మజ్జి గౌరీశంకర్, టీడీపీ నాయకులు దేవరపల్లి వెంకట అప్పారావు. మెంబర్ శ్రీను, సేనాపతి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు నాయుడు, పప్పు శ్రీను పాల్గొన్నారు.

ఆ వ్యాఖ్యలు దిగజారుడుతనానికి నిదర్శనం : ఎమ్మెల్యే రాజు

అమరావతి ప్రాంత మహిళలపై సాక్షి మీడియాలో కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు వారి సంకుచిత మనస్తత్వాన్ని ఎత్తి చూపిస్తున్నాయని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మహిళలను కించపరిచిన వారు తమ ఇంట్లో కూడా మహిళలు ఉన్నారన్న ఇంగితాన్ని మరచిపోయి వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. మహిళలకు సాక్షి మీడియా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే రాజు డిమాండ్ చేశారు.



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రాజు

లక్ష్మీపురంలో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

పనిచేయని నీటి పథకాలు... నాలుగు రోజులుగా నిలిచిపోయిన తాగునీటి సరఫరా.. ఇబ్బంది పడిన గ్రామస్థులు



కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



పనిచేయని నీటి పథకం



కాలిపోయిన మోటార్‌ను బాగు చేస్తున్న సిబ్బంది

చోడవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురంలో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్చకపోవడంతో పంచాయతీలో నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్థులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు లోవోల్టేజీ సమస్యతో కాలిపోయినప్పటికీ ఈపీడీసీఎల్ అధికారులు సకాలంలో మార్చలేదు. దీంతో గ్రామంలో నీటి పథకాలు మూలకు చేరాయి. ఫలితంగా తాగునీటి కోసం మహిళలు నానా పాట్లు పడుతున్నారని స్థానిక సర్పంచ్ సిరిసోళ్ల గంగాభవానీ ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలో ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న మెయిన్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది, ఆ ట్రాన్స్‌ఫార్మర్ మీద ఉన్న రక్షిత నీటి పథకానికి ఏర్పాటు చేసిన మోటార్లు పనిచేయక, నీరు పంపింగ్ కావడం లేదు. గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ కూడా పనిచేయకపోవడంతో ఆ కాలనీలోని నీటి పథకానికి కూడా నీటి సరఫరా ఆగిపోయింది. పంచాయతీ పరిధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోయినా, నెలల తరబడి వాటిని విద్యుత్ శాఖ అధికారులు మార్చడం లేదని సర్పంచ్ అన్నారు. అంతేకాకుండా విద్యుత్ లోవోల్టేజీ సమస్య కూడా పరిష్కారం చేయకపోవడంతో తరచూ నీటి పథకాల మోటార్లు కాలిపోతున్నాయని ఆమె వాపోయారు. విద్యుత్ అధికారులు స్పందించి తమ పంచాయతీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బాగు చేసి వినియోగంలోనికి తెస్తే తప్ప తాగునీరు సరఫరా అయ్యే పరిస్థితి లేదన్నారు. అధికారులు తక్షణం స్పందించాలని ఆమె కోరారు.

రావికమతం సీడీపీవోగా మంగతాయారు



రావికమతం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రావికమతం మహిళా, శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారిణిగా వి. మంగతాయారు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన బి.ఉషారాణి 2024 డిసెంబరులో పదవీ విరమణ పొందారు. ఖాళీగా ఉన్న ఈ స్థానంలో కె.కోటపాడు ప్రాజెక్ట్ నుంచి మంగతాయారు బదిలీపై ఇక్కడకు వచ్చారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా పోలమాంబ ఒడ్డు పండగ



పోలమాంబను దర్శించుకున్న మాజీఎంపీపీ భాస్కరరావు, తదితరులు

దేవరాపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెల్లిపేట పోలమాంబ ఒడ్డు పండగ మంగళవారం ఘనంగా జరిగింది. రెల్లి కులస్థులు మామిడి పండ్లు సీజన్ పూర్తయిన వెంటనే ఈ పండగను ఘనంగా నిర్వహిస్తారు. ఉదయం నుంచి పూజలు చేసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, అర్జునరావు, దీవిశంకర్, గవిరెడ్డి సింహ, జ్వాలా తదితరులు పాల్గొన్నారు.